# నయగరా

సి. ఆనందారామం



నాకోసం న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌కి వచ్చింది, సమీర. దానికి నాన్నగారు ఆ పేరు ఎందుకు పెట్టారో కానీ, అన్ని విధాలా సార్థకనామధేయురాలన్నట్లుగా ఉంటుంది. కస్టమ్స్ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తిచేసుకుని, ఇమిగ్రేషన్ సర్టిఫికేట్ తీసుకుని, లగేజ్ కలెక్ట్‌చేసుకుని బయట పడేసరికి ఏదో యజ్ఞంచేసినంత పనైంది. అదీగాక కస్టమ్స్ చెకింగ్ పూర్తయ్యే వరకు మరొకరు రావటానికి వీల్లేదు. అవన్నీ నేనొక్కదాన్నే చూసుకోవలసిందే. ఏనాడూ అలవాటు లేని వ్యవహారం! నాన్నగారిమాట కాదనలేక బయలుదేరాను కానీ, ఒంటరిగా స్వదేశంలో ప్రయాణం చెయ్యాలంటేనే, భయం నాకు. ఏదో కొత్త ఇంగ్లీషులో మాట్లాడగలిగినదాన్ని గనుక ఎలాగో బయటపడగలిగాను. నన్ను చూడగానే అక్కడే ఎయిర్‌పోర్ట్‌లోనే గట్టిగా కౌగలించుకుని బుగ్గమీద ముద్దుపెట్టేసు

కుంది సమీర- అమెరికన్ అలవాట్లన్నీ వంటపట్టించేసుకుంది కాబోలు! నా రాకకు తెగ సంబరపడిపోతోంది పాపం! ఎందుకొచ్చానో తెలీదు.

"రా! వెళ్దాం!" అంటూ చకచక సామాన్లన్నీ కారుడిక్కీలో పడెయ్య సాగిండి.

"పోర్టర్ని పిలవరాదు!" అన్నాను, అలవాటుగా.

"ఇంకా నయం! ఇక్కడ పోర్టర్ని పిలిచామంటే ఆరిపోతాం! మన పను లన్నీ మనం చేసుకోవలసిందే!"

డిక్కీ తలుపు మూసేసి, తను డ్రైవింగ్‌సీట్‌లో కూచుని, కారు తలుపు తెరిచి "రా!" అంది.

నేను కూచుని డోర్ మూసి "డ్రైవింగ్ కూడా నేర్చుకున్నావా?" అన్నాను.

"ఆ? ఈ అమెరికాలో తిండిలేక పోయినా బ్రతకగలంకాని, కారులేకుండా డ్రైవింగ్ రాకుండా బ్రతకలేం! ఫేమిలీస్ కయితే రెండు కార్లుంటాయి. భార్యలకు పెద్ద కార్లు, భర్తలకు చిన్న కార్లు...."

"అదేమిటీ? ఆడవాళ్ళకు పిళ్ళిస్తున్న గౌరవమా?"

సమీర నవ్వింది-

"అదేంకాదు- మొగవాళ్ళ కారు ఎక్కువగా తిరుగుతుంది అంచేత చిన్న కారు- పెట్రోలు తక్కువ ఖర్చు కావ టానికి...."

రోడ్డువంక చూస్తూ నవ్వుతూ కబుర్లు చెప్తూ- డ్రైవ్‌చేస్తున్న సమీరను చూస్తే ఎంతో గర్వం కలిగింది నాకు. అంత లోనే ఏదో బాధకూడా కలిగింది. ఇంత అందమైనది, ఇంత చదువుకొన్నది- ఇంత తెలివైనది- ఎందుకిలా తెలిసి తెలిసి గోతిలో పడుతోంది? దాని ముఖం లోకి చూశాను. కళ్ళు ఎప్పటిలా మెరు స్తున్నాయి కానీ, కళ్ళకింద నల్లటి చారికలు అప్పుడే ఏర్పడుతున్నాయి, అశాంతికి చిహ్నంగా- అవును! ఇలాటి వ్యవహారాల్లో అశాంతి కాక మరేం ఉంటుంది?

కారు దాని ఫ్లాట్ ముందు ఆగింది. ఆకాశాన్నంటే స్కైస్క్రేపర్‌లో ఒక అపార్ట్‌మెంటు అది. దానిలో ఎన్ని అపార్ట్‌మెంట్స్ ఉన్నాయో లెక్కపెట్ట లేకపోయాను. ఆ భవనం ఆవరణలో కార్ పార్కింగ్‌ప్లేస్‌లో లెక్కలేనన్ని కార్లు, చీమలబారుల్లా- తన కారు పార్క్ చేసుకోవటానికి స్థలం దొరక్క కొంత సేపు అటూఇటూ తిరిగి, చివరకు ఎలాగో పార్క్‌చేసింది. దాని అపార్ట్‌మెంట్ నైన్త్ ఫ్లోర్‌లో- లిఫ్ట్‌లో వెళ్ళాం.

అపార్ట్‌మెంట్ మరీ పెద్దది కాక పోయినా చాలా పొందికగా ఉంది. నేలంతా మెత్తని కార్పెట్లు పరిచి ఉన్నాయి- ఉన్న రెండు బెడ్‌రూమ్స్‌కి అటాచ్డ్ బాత్స్ ఉన్నాయి. నా సామాను లన్నీ ఒక బెడ్‌రూంలో అదే సర్ది

"స్నానంచేస్తే చెయ్యి-" అంది.

నాకు అమెరికాలో అన్నింటికంటే నచ్చింది స్నానాలగది- బాత్‌టబ్స్, షవర్స్- హాట్ అండ్ కోల్డ్ వాటర్ అరేంజ్‌మెంట్స్. ఇండియాలో కూడా పోష్ హోటల్స్‌లో ఇలాంటి బాత్ రూమ్స్ ఉంటాయని విన్నాను- కానీ నే నలాంటి హోటల్స్‌కి ఎప్పుడూ వెళ్ళ లేదు. వేడినీళ్ళు షవర్‌లోంచి జల్లులా తలమీద పడుతోంటే ప్రయాణబడలిక అంతా తీరిపోయింది. నేను స్నానంచేసి తయారయి వచ్చే సరికి సుమిత ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతోంది.

"నో డియర్! ఏమీ లాభంలేదు- ఈ రోజు మా అక్కయ్య వచ్చింది- ఎంతమాత్రం కుదరదు-"

అవతలివైపునుంచి ఏం వినిపించిందో సుమిత కిలకిల నవ్వింది. అది అంతగా నవ్వుతుందని నాకు అంతకుముందు తెలీదు. మనసులో ఉల్లాసం కలిగితే, నవ్వు అంత అందంగా ఉంటుందేమో!

"యూ, నాటీ! షటప్! బైదిబై, రేపు అక్కని నయగరా తీసికెళ్తున్నాను- నువ్వూ వస్తావా?"

అవతలివైపునుంచి ఏం సమాధానం వచ్చిందో నవ్వుతూ "ఓకె" అని ఫోన్ పెట్టేసింది- అప్పుడు చూసింది నన్ను.

"భోజనం చేద్దామా?" అంది.

వంటంతా ఎప్పుడో తయారయి ఉంది. అన్నీ ఫ్రిజ్‌లో ఉన్నాయి- ఆ పాత్ర లన్నీ తీసి కొన్ని స్టవ్‌మీద, కొన్ని ఓవెన్‌లోనూ వేడిచేసింది-

ఇద్దరం భోజనం చేస్తుంటే చెప్పింది-

"ఇక్కడ మేము మామూలు భోజనం చేసేది, కేవలం రాత్రిపూట. పొద్దున్న బ్రెడ్ కాఫీ. లంచ్ శాండ్‌విచెస్ తీసుకు పోతాము. మధ్యాహ్నం ఎప్పుడైనా ఏదో ఒక స్నాక్స్ తింటాము. ఒక రాత్రి ఇంటికొచ్చి స్టవ్ మీద వండుకుంటాము. ఫ్రెంచ్ ఫ్రైస్, చికెన్ ఫ్రైస్ మొదలైన పదార్థాలన్నీ ఉంటాయి. కనుక వంట పెద్ద కష్టం కాదు [illegible]"

ఏదో చెప్తూపోతోంది అది- నేను వచ్చిన విషయం ఎలా ప్రారంభించాలా అని ఆలోచిస్తున్నాను- ఎందు కంటే అది చిన్నపిల్ల కాదు- ఒప్పించ టానికి ప్రయత్నిస్తే నా యిష్టం అని ఎదురుతిరిగే ప్రమాదం ఉంది- అందుకే అది ఎంచుకొన్న మార్గం ఎంత తప్పో దాని మనసుకే నచ్చేలాగ నచ్చజెప్పాలి.

"ఒక్కదానివే ఇక్కడ ఉండకపోతే, అక్కడికి వచ్చెయ్యకూడదూ? చదువు పూర్తయిందిగా! ఆ మాత్రం ఉద్యోగం అక్కడ దొరకదా?"

ఏదో ఆలోచిస్తూ తింటోందేమో కొంత ఆశ్చర్యంగా, "ఒక్కదాన్నే ఉంటున్నాననా?" అని, అంతలో సర్దుకుని "ఏం ఫరవాలేదు. అదే అలవా టవుతుంది. ఆమాటకొస్తే ఇండియాలో

నువ్వు మాత్రం ఒంటరిగా ఉండటం లేదా ?" అంది.

ఇదే భయం నాకు: ఏదైనా చెప్పబోతే "నువ్వుమాత్రం....?" అని ఎదురుప్రశ్న వేస్తుందేమోనని. నా సంగతి- ఆ సందర్భమూ పూర్తిగా వేరు- దివాకర్‌లాంటి మనుష్యులు నూరుమందిలో ఒక్కడుంటారు. కానీ, ఇప్పుడు సమీరతో ఈ రకంగా వాదించి ప్రయోజనంలేదు. "నా విషయమూ ప్రత్యేకమైనదే!" అని కొట్టిపారేస్తుంది. ఇంతకు ఇది ఒంటరిగా ఉండటంలేదన్నమాట! అయితే నాన్నగారి ఆందోళన నిష్కారణమైనది కాదు- నాకు సాధ్యమవుతుందా, దీని మనసు మార్చటం?

"అక్కయ్యా! రేపు నిన్ను నయగరా తీసుకెళ్తున్నాను."

"థాంక్స్!"

"మనతో నా స్నేహితుడు సాగర్ కూడా వస్తున్నాడు."

హమ్మయ్య- అదే తీసుకొచ్చింది ప్రస్తావన- ఇప్పుడే కాస్త కదిలించాలి!

"స్నేహితుడంటే?"

అది నవ్వింది నిర్లక్ష్యంగా- నా దగ్గర దానికి భయంలేదు.

"స్నేహితుడంటే, నేను నయగరాకి రమ్మనగానే నా మాట కాదనలేక వెంటనే మనతో వచ్చేసేవాడు- ఏమిటక్కా, ఈ ప్రశ్నలు?"

నాకు నేను నిట్టూర్పు విడుచుకున్నాను-

"అతనికి పెళ్ళయిందా?"

ఈ ప్రశ్నకు మాత్రం దాని ముఖాన మబ్బులు ముసిరాయి- తల వంచుకుని వేలితో అన్నం పళ్ళెంలో రాస్తూ "అయింది" అంది.

"పిల్లలున్నారా?"

"ఆ! ఇద్దరు-"

"అయితే ఈ స్నేహం బహుశః హద్దులలోనే ఉంచే ప్రయత్నం చేస్తుండాలి నువ్వు."

దానికి అది సమాధానం చెప్పలేదు- కొంచెంసేపాగి "అతనికి ఇంకా అఫైర్స్ ఉన్నాయి- అఫైర్స్ మాత్రమే కాదు- ఇంకా చాలామంది ఆడవాళ్ళతో- అన్ని తరగతుల వాళ్ళతో స్నేహాలున్నాయి-" అంది.

అదీ నేను అక్కచెల్లెళ్ళలా మాత్రమే కాక, స్నేహితుల్లా కూడా ఉంటాం-అంచేత తన మనసులో ఆవేదన నాకు చెప్పుకోకుండా ఉండలేదు.

కానీ, దానికి ఇప్పుడు నేనేం చెప్పను? దానికి తెలియని దేముందని నేను చెప్పటానికి? ఒక ప్రయత్నం చేశాను-

"సమీరా! ఇదంతా దేనికి దారి తీస్తుందో నీకు తెలీదా? ఇప్పటికైనా ఈ స్నేహాన్ని ఇక్కడితో ఆపేస్తే మంచిదికదా!"

"అయామ్ హెల్ప్‌లెస్?"

కన్నీళ్ళతో చరాలున అక్కడినుంచి లేచిపోయింది-



అది తెలియనిది కాదు_ లోలోపల అదే మథనపడుతోంది. ఇలాంటి దానికి ఏం చెప్పాలి? వచ్చిన రోజే సమీరను ఇంకా ఏడిపించటం ఇష్టంలేకపోయింది నాకు_ ఇదీగాక, అది ఏడుస్తోంటే, నేను చూడలేను_ అంచేత మాట మరిపిస్తూ "నీ దగ్గిర చాలా కేసెట్స్ ఉన్నాయే! ఏవైనా ఇంగ్లీష్ పాటలు వినిపించు_ వినాలని ఉంది_" అన్నాను.

అది ఏదో కేసెట్ టేప్‌రికార్డర్‌లో ఫిక్స్‌చేసి టేప్‌రికార్డర్ ఆన్‌చేసింది.

"హనీ! హనీ!...." అనే పాట_

ఏదో దానిని మరిపించాలని పాటలు కావాలన్నానే కానీ నాకా పాటలలో పెద్ద

ఇంట్రస్ట్ లేదు- అంచేత "అక్కా! ఎలా ఉంది ఈ చరణం!" అని అడిగితే ఉలికిపడి "ఏమిటి," అన్నాను- అది మళ్ళీ రీవైండ్‌చేసి ఆన్‌చేసింది.

"నువ్వు స్కౌండ్రల్‌వని నాకు తెలుసు- కానీ, నా మనసు నీ వెంట పరుగులు తీస్తోంది-" అని అర్థంవచ్చే చరణాలు వినిపించింది. దాని మనసు నా కర్థమయింది. ప్రాణం ఉసూరు మంది. తెలియనివాళ్ళకు ఎలాఅయినా చెప్పగలం తెలిసి తెలిసి గోతిలో పడదలచుకొన్న వాళ్ళకు ఏం చెప్పగలం?

ఆ మరునాడు ఉదయమే సాగర్ వచ్చాడు, తన కారులో. అతడిని చూసి నేను కొంచెం ఆశ్చర్యపోయాను- నేను విన్నదాన్ని బట్టి అతడు ఆజానుబాహువూ, అరవిందదళాయతాక్షుడూ అయి ఉంటాడనుకున్నాను- కొంచెం పొట్టిగా దానికి తగినట్లు సన్నగా ఉన్నాడు. ముఖంలో కళ ఉంది కానీ, చూసీచూడగానే ఎంతో అందమైనవాడు అనే భావం మాత్రం రాదు. సమీర పరిచయం చేసింది "మా అక్క-" అని. అతని నమస్కారానికి ప్రతినమస్కారం చేస్తూ 'సమీరలాటి ఆడపిల్ల ఈ వ్యక్తి విషయంలో ఏం చూసి ఇలా పిచ్చిదయిపోతోందీ?' అనుకున్నాను.

"అందరం ఒకే కారులో వెళ్దాం! అలా అయితే కొంచెంసేపు సాగర్, మరికొంచెం సేపు నేను, డ్రైవ్ చేయొచ్చు." అంది సమీర తన కారు బయటకుతీస్తూ.

సాగర్ తనేవచ్చి చొరవగా సమీర పక్కన కూచున్నాడు- వెనక్కి తిరిగి నన్ను చూసి నవ్వుతూ "మీకేమైనా అభ్యంతరమా?" అన్నాడు- అప్పుడు అర్థమయింది, అతని నవ్వులో మెరుపు- "లేదు!" అన్నాను తలవూపుతూ. అతడు నా ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు. అంతలో ఏదో అర్థమయినట్లు నవ్వుకొని తల తిప్పుకున్నాడు. అప్పుడు కానీ నాకు స్ఫురించలేదు.. అతడిపట్ల నాలో తల ఎత్తిన అసహనభావం నా కళ్ళలో కనిపించిందని- అది అతని కర్థమయిందని- ఎంతో తెలివైనవాడు! ఒక్కొక్క క్రాస్‌రోడ్స్ దగ్గరా "టోల్‌టాక్స్" వేసుకొంటూ వెళ్తున్నారు- అక్కడి రోడ్సన్నీ ప్రైవేట్ కంపెనీలవేనట! ఆ రోడ్స్ మెయిన్‌టెన్ చెయ్యటానికి ప్రయాణీకులే సుంకాలు చెల్లించాలి! ఈ పద్ధతే బాగుందనిపించింది. అందుకే రోడ్లు యింత శుభ్రంగా ఏలాంటి రిపేర్లు అవసరంలేకుండా ఉన్నాయి. ఎక్కడికక్కడ చిన్న చిన్న రెస్టారెంట్లు ఉన్నాయి. ఒకచోట కారు ఆపి లోపలికి వెళ్ళారు. సెల్ఫ్‌సర్వీంగ్ సిస్టమ్- ఎవరికి కావలసినవి వాళ్ళు తెచ్చుకుని టేబిల్స్ ముందు కూచుంటున్నారు.

"ఇక్కడ మంచి బ్రెడ్, బిస్కట్స్, ఐస్‌క్రీంతప్ప ఇంకేం తినలేదు." అని తనే అవి తీసి ప్లేట్లో పెట్టి నాకు అందిం

చాడు సాగర్. సమీరా, సాగర్ హాట్ డ్రింక్స్ తీసుకున్నారు. టేబిల్ ముందు కూచున్నాక, నేను కొంచెం ఆశ్చర్యంగా

"నేను శాఖాహారినని మీకెలా తెలుసు?" అన్నాను.

"ఊహించాను."

"ఎలా?"

"మీ మాటల్లో ఉంటుంది పట్టేస్తే బ్రాహ్మణవాదస్త్రం, కొద్దిపాటి మాంసాహారాల వాసన సోకగానే, ముఖం చిట్లించే మీ వైఖరి... ఓకవి బట్టి..."

సమీరతో పాటు నేనూ నవ్వాను_ అతని మాటల్లో ఏదో వింత ఆకర్షణ ఉంది. మళ్ళీ బయలుదేరుతున్నప్పుడు సాగర్ డ్రైవ్ చేసాడు. ఉదయం పది గంటలకు న్యూయార్క్‌లో బయలుదేరిన వాళ్ళం. సాయంత్రం ఆరింటికు నయగరా చేరుకున్నాం. ... నని కావటంవల్ల హైటం కిరణాలు, ఇండి యాలో మూ... అంత ప్రకాశవంతంగా_వుంది వెలుగు కాని, అంతలో తీక్షణ లేదు_ హోటల్‌లో రెండు రూమ్స్ మాట్లాడుకుని _మా సామాను రూమ్స్‌లో పడేసి, మళ్ళీ ఏదో కొస్త తిని టీలు తాగి స్కైలాన్ టవర్ చూడటానికి వెళ్ళాం. నయగరా నదిపట్టానికి 520 అడుగుల ఎత్తున వుంది. ఆ టవర్‌కి_గ్లాస్ యెన్ క్లోజర్స్ ఉన్న యెలివేటర్స్ వున్నాయి. యెలివేటర్‌లో అడుగుపెడుతూ సమీర తూలిపడి "అబ్బా!" అంది_మరుక్షణం సాగర్ సమీర పక్కన వున్నాడు _ సమీరను సాగర్ చేతుల్తోదించి సమీర ముఖంమీదకు వంగి "ఏమయిందీ?" అన్నాడు_"పాదం ఏదో బెణికినట్లయింది చాలా సేపు డ్రైవ్ చేశానుకదూ! ఈ మధ్య జ్వరంవచ్చి కాస్త నీరసంగా వున్న మీదట..." చెప్పింది సమీర.

"నా కెందుకు చెప్పలేదు మరి? నువ్వు డ్రైవ్ చెయ్యాల్సిన అవసరమేముంది అసలు? నీ కసలు బుద్ధిలేదు." తిడుతున్నట్టుగా వున్నా, ఆ మాటలు ఎంతో మెత్తగా వున్నాయి. ఆ స్వరంలో మనసుని బుజ్జగించే లాలన, ప్రతి అక్షరంలోనూ అనురాగం ఉట్టిపడుతోంది. సమీరను అతను క్రింద అడుగుపెట్టనివ్వలేదు. తన చేతుల్లో ఎత్తుకున్నాడు. ఇక సమీర ... వాని ... అయిపోయుండొ, నాకు అర్థమయిపోయింది. ఇండియా ... లంపాటు చొస్తున్న మన్నల్ని ఎవరైనా చూస్తున్నారేమోనని చుట్టూ చూసాను. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవటంలేదసలు. ఇలాంటివి వాళ్ళు ఎప్పుడూ చూస్తూనే వుంటారేమో! అక్కడున్న జంటలన్నీ ఒకరితో మరొకరు చేయికలుపుకొనే నడుస్తున్నారు. రివాల్వింగ్ రెస్టారెంట్ చేరుకొనేవరకు సాగర్ చేతుల్లోనే వుంది సమీర. అక్కడ మళ్ళీ టీ తాగుతూ దూరంగా కనిపించే అకాశాన్నంటే భవనాలనూ, పచ్చటి పూలతోటల్నీ

స్కైలాన్ టవర్ కింద వున్న ఎమ్యూజ్మెంట్ పార్క్ని చూసాం. ఆ తరువాత అబ్జర్వేషన్ డెక్ మీదనుంచీ నయగరా జలపాతాన్ని విద్యుద్దీపాల రంగురంగుల కాంతుల్లో చూసాం. అబ్బ! ఏమి సుందరదృశ్యం అది. చాలాదూరం నుంచి రంగురంగుల ఎలక్ట్రిక్ లైట్స్తో మొత్తం జలపాతాన్ని ఇల్యూమినేట్ చేస్తున్నారు. ఎరుపు, నీలం, ఊదా, లేత ఆకుపచ్చలో నీలం కలిసిపోయిన లాంటి షేడ్. ఈ రంగులన్నీ హోరున దూకే జలపాతంతో శ్రుతికలిసి నాట్యం చేస్తూ ఎప్పటికప్పుడు తమ తమస్థానాలు చేరుకుంటున్నాయి. జలపాతాల క్రింద వున్న కొండలమీద తెల్లని వెలుగులు గుమ్మరిస్తున్నారు. అంచేత ఆకొండలు మంచుకొండల్లా వున్నాయి. శివుని జటాజూటంనుంచి విముక్తమై హిమవన్నగం మీదకు వురికే గంగాభవాని విశ్వరూపం ప్రత్యక్ష మవుతోంది, ఆ జలపాతపు ఉద్ధృతనాట్యంలో - శివుని మూడవ కంటి మంటలనంటి ఏర్పడ్డాయా, ఈ జలధారలు? జటాజూటంలోని కపిల వర్ణాన్ని కలిగిస్తూ వింతవింత రంగులు సంతరించుకొంటున్నాయనా అంతటి ఉద్ధృతాన్నీ నిశ్చలంగా సహిస్తున్నడా, హిమవంతుడు?

నా ఆలోచనలకు నాకేనవ్వొచ్చింది. ఏమిటి నా ఊహలు? ఇక్కడి అమెరికన్లకు కానీ, కెనెడియన్లకు కానీ "గంగావతరణం" కథ ఎలా తెలుసు? దానికి అనుగుణంగా ఈ విద్యుత్కాంతులు ఎందుకు ప్రసరింప చేస్తారు? అంతం అవస్థలో ఉంచారు. ఎప్పటికీ చూసే కంటిలో వుంటుంది. వహో ధృతిమైన ఆ వడిలో, ఆ తీవ్రతలో ఎంత ఆకర్షణ? విశ్వ చైతన్యమంతా ఏకమై హోరున "రా! రా! ఈ మహాశక్తిని దర్శించు." అని కోటి చేతులతో ఆహ్వానిస్తున్నట్లుగా ఉంది. నా ఊహల లోంచి తెప్పరిల్లి పక్కకి చూసాను. సాగర్ హృదయంపైన వాలివుంది సమీర. సాగర్ కొంచెం పొట్టికావటం వల్ల, సమీరా సాగర్లిద్దరూ ఇంచుమించు ఒకే ఎత్తులో వున్నారు. సాగర్ వంగి సమీర బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాడు. అప్రయత్నంగా సాగర్ చూపులు నా చూపులతో కలుసుకున్నాయి. నేను ముఖం తిప్పుకున్నాను. సమీరా సాగర్లను అలా చూడటం, నా కేమీ వింతగా తోచలేదు. అమెరికా వచ్చాక, ఎక్కడపడితే అక్కడ అలాంటి జంటలను చూడటం అలవాటైపోయింది.

సమీర నా దగ్గరకి వచ్చి "ఇంక పోదామా!" అంది. మౌనంగా బయలుదేరాను. స్కైలాన్ టవర్లోనే మరో ఫ్లోర్లోవున్న గిఫ్టుషాప్కి తీసికెళ్ళింది సమీర. యెలివేటర్స్ మాత్రమేకాక యెస్కలేటర్స్కూడా వున్నాయి. ఆ తరువాత హోటల్కి వచ్చేసాము.

సమీర గాఢంగా నిద్రపోతుంది, నాకు నిద్ర రావటంలేదు. నాన్నగారు నాకు అప్పచెప్పిన పని నేను చెయ్యలేనేమో అనే అధైర్యం కలుగుతోంది. ఒకసారి సాగర్‌తో మాట్లాడాలనుకున్నాను. 'ఇంత రాత్రివేళా' అని సంకోచం కలిగింది. కానీ పెద్దవాణ్ణి, నా కేమిటి? అనుకున్నాను. అదీగాక, సాగర్‌తో ఒంటరిగా మాట్లాడాలంటే, ఇంతకంటే మంచి సమయం నాకు దొరకదు. సాగర్ రూం మా రూం ప్రక్కనేవుంది. వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను. తలుపులు వెంటనే తెరుచుకున్నాయి. కొంచెం ఆశ్చర్యంగా "నిద్రపోలేదా?" అన్నాను.

"మీరు వస్తారని తెలుసు. మీకోసమే ఎదురుచూస్తున్నాను."

"తెలుసా? ఎలా?"

"ఇందాక సమీరా, నేను దగ్గిర దగ్గిరగా వున్నప్పుడు మీ కళ్ళు చూసాను. నాకు నిజంగా భయంవేసింది. సమీరను వదిలేసేవాడినేమోకూడా. కానీ తనను కష్టపెట్టడం ఇష్టంలేక .... .... ...."

"సమీరను మీరు ప్రేమిస్తున్నారా?"

"నాకు తెలీదు."

"అంటే?"

"తనూ నేనూ ఎలాగో, ఎందుకో సన్నిహితంగా వచ్చాం. అంతే."

"సమీరను పెళ్ళిచేసుకోగలరా?"

"చేసుకోలేను. ఆ అవకాశం లేదు. అది సమీరకు తెలుసు. నేనే చెప్పాను."

"ఇదంతా మీ భార్యకు ద్రోహం కాదా? అంతకంటె ఆమెకు విడాకులిచ్చి, మీకు నచ్చినవాళ్ళతో వుండరాదూ?"

"నా భార్య విడాకులు కావాలనుకుంటే ఎప్పుడో ఇచ్చి వుండేది. కాని పోట్లాడటం లేదు. అయినా నేనంటే చాలా ప్రేమ. నా అఫైర్స్ తనకు తెలుసు. వాటి గురించి పట్టించుకోదు. మా వివాహం విచ్ఛేదం కాకుండావుంటే చాలునని కోరుకుంటుంది. తనకి నేను కష్టంకలిగించలేను. అదీగాక మాకొక బాబూ, పాపా వున్నారు. వాళ్ళ క్షేమంకూడా నాకు కావాలి?"

నాకు కోపమూ, గౌరవమూ రెండూ కలుగుతున్నాయి. కోపం అతని నిర్లక్ష్య వైఖరికి, గౌరవం అతని నిజాయితీకి.

"సమీరని నాతో తీసుకుపోదామని వచ్చాను."

"తీసికెళ్ళండి. అదే తనకి చాలా మంచిది."

అతని కంఠంలో జీర లేకపోలేదు. కానీ, చాలా సిన్సియారిటీ వినిపిస్తోంది.

"మీ సహకారం కావాలి. మీరు వెళ్ళమని చెప్పాలి."

"అది నావల్లకాదు. నన్ను ప్రేమించే వాళ్ళని నేను కష్టపెట్టలేను."

నాకు కోపం వచ్చింది.

"ఎంత సేపూ నేను ప్రేమించే వాళ్ళని........ అనే అంటారు. మీరు ప్రేమిస్తున్నవాళ్ళు ఎవరూ లేరా? మీ

కనలు ప్రేమ అంటే ఏమిటో తెలీదా,

"ఎందుకు తెలీదూ? నా మనసులో ఉన్నదంతా ప్రేమే? ఈ లోకాన్నంతటినీ – ఈ పచ్చని మైదానాలన్నీ – ఠీవిగా తలఎత్తి నిలబడే ఆ కొండల్నీ, విశాలమైన సరసుల్నీ, అనంతమైన సాగరాన్ని ఉద్ధృతమైన జలపాతాల్నీ – అన్నింటినీ– అందరినీ ప్రేమిస్తున్నాను. ఇంతవరకు నేను ఏ ఆడపిల్లనీ నా జీవితంలోకి ఆహ్వానించలేదు. వాళ్ళే వస్తున్నారు నేను తిరస్కరించలేను."

నాకు కోపం వస్తోంది. ఎంత కోపం వచ్చినా [illegible] [illegible]ించ లేకపోతున్నాను.

"ఒక అమ్మాయిగా నేను నమ్మిన జీవి[illegible] [illegible] [illegible]తున్నాను. ఇవన్నీ ఇల్యూజన్స్ – ఇది ప్రాక్టికల్ లైఫ్ [illegible] [illegible]"

అ[illegible]


"ప్రాక్టికల్ లైఫ్?.. .... అంటే ఏమిటి? ప్రాక్టికల్ లైఫ్ ని ఏ విధంగా ఎంతవరకు ఉపయోగిస్తుందని మీరు ఇంకా క నయాగరా ఫాల్స్ చూస్తూ అలా ఉండిపోయారా – ఆ రంగు రంగుల విద్యుత్కాంతులన్నీ ఇల్యూజన్స్ అని మీకు తెలీదా? మరి, ఆ రంగుల నుండి విడదీసినట్టి నీటిరంగు ఊహించటానికి ప్రయత్నించారా? ఆ మాటకొస్తే, ప్రతి సూర్యోదయమూ, సూర్యాస్తమయమూ, సప్తవర్ణాల ఇంద్రధనుసులూ, ఇవన్నీ ఇల్యూజన్స్ కావా? వాస్తవిక సత్యాలు, శాస్త్రీయమైన సత్యాలు– ఈ రంగురంగుల కలల కతీతమైనవని మనకు తెలీదా? కానీ, ఈ రంగులూ, రుచులూ మన కళ్ళముందు లేకపోతే మన జీవితాలు ఎంత నిస్సారంగా ఉండేవి" విభ్రాంతితో వింటున్నాను. అతని మాటల్లో నిజాన్ని కాదనలేకపోతున్నాను.

"కానీ, మీరు ఇంతమంది ఆడపిల్లల్తో .... ఇలా .... వాళ్ళంతా బాధపడటంలేదూ?"

"ఒకసారి చెప్పాను. మళ్ళీ చెప్తున్నాను – నేను ఎవరినీ ఆహ్వానించలేదు. ఎవరినీ బాధపెట్టటంలేదు – అన్నట్లు మీరంతా శ్రీకృష్ణుణ్ని దేవుడని ఎందుకంటున్నారు?"

అతను ఏ పాయింట్ పైన డ్రైవ్ చేస్తున్నాడో అర్థమయింది. అతనితో తర్కించేం సేఫ్ మాట్లాడితే, నేనేమయిపోతానో అని భయంవేసింది. అంత కన్విన్సింగ్‌గా వుంది అతని వాయిస్. అకస్మాత్తుగా 'తూర్పు-పడమర' సినిమా గుర్తొస్తోంది. శరీరం జలదరించింది.

"భయపడకండి. అజ్ఞానం భయానికి మూలం– మన జ్ఞానంలో మనముంటే, దేనికీ భయపడక్కరలేదు." అతడు నేను నోరు మెదపకుండానే నా ఊహాలు చదివేస్తున్నాడు. అఖండమైన తెలివి. ఆడపిల్లలు ఇతడ్ని ఎందుకింతగా ప్రేమిస్తున్నారో అర్థమయింది. లేచి




మా గదిలోకి వచ్చేశాను. సమీర హాయిగా నిద్రపోతోంది. నిద్రలోకూడా దాని పెదవులు చిరునవ్వుతో విచ్చుకొన్నట్లుగా వున్నాయి- దానికి ఇంత ఆనందాన్నీ, సంతృప్తినీ, శాంతినీ ఈయగలిగిన ఈ అనుభూతి అబద్ధమా? నిషిద్ధమా? ఏమో? దీనికి బుద్ధిచెప్పి ఇంటికి తీసుకుపోవాలని వచ్చిన నేనే అయోమయంలో పడిపోయేలా ఉన్నాను.

ఆ మరునాడు ముందుగా క్వీన్ విక్టోరియా పార్క్‌కి వెళ్ళాం. దూరంగా స్కైలాన్ టవర్ కనిపిస్తోంది, ఎత్తుగా. ఎటుచూసినా పచ్చదనం- తెలుపు, ఎరుపు, పసుపురంగులలో రకరకాల పూలు కళ్ళు పండువుగా - వాంఛలా అవి? డాలియాలలో వింతరకాలా? కలువలలో కొత్తరకం మెట్టకలువలా?

ఏమో ఎక్కడ చూసినా జంటలుగా స్త్రీ పురుషులు. ఎవరూ మరొకరిని పట్టించుకోరు. ఎవరి లోకం వారిది. ఇంటర్‌నేషనల్ బౌండరీ దాటి కెనెడియన్ వైపుకి వెళ్ళాం - నయగరా ఫాల్స్‌లో అందమైన భాగం కెనడావైపే వుంది. అటువైపు ఈ జలపాతాన్ని "హార్స్ షూ ఫాల్స్" (Horse Shoe Falls) అంటారు. గుఱ్ఱపునాడా ఆకారంలో వంపుతిరిగి వుంటుంది. అందుకని-రాత్రి రంగురంగుల విద్యుద్దీపాల కాంతులలో కింపే ఏ రంగులూ లేకుండా

మరింత మనోహరంగా వుంది ఆ దృశ్యం. ఎడతెగక మహోధృతంగా దూకే జలధారలు. ప్రకృతి ఏదో మహానంద పారవశ్యంలో నగ్నంగా నృత్యం చేస్తున్నప్పటి మనోహరత్వం—ఆ వేగానికి నీటి తుంపరలతో ఏర్పడిన మిస్ట్ మబ్బుల్లా చాలాదూరం ఆవరిస్తోంది.

సాగర్ తన కోటు తీసి సమీరకు తొడిగాడు; అప్పుడు కాని నాకు తెలీలేదు, సన్నగా వానజల్లు పడుతోందని - సమీర పెదవులమీద కృతజ్ఞత సూచించే చిరునవ్వు - అక్కడినుంచి రెస్టారెంట్ కి వెళ్ళాం. బ్రెడ్ టోస్ట్ తింటున్నప్పుడు "సారీ! నా పర్స్ ఆ కోటుజేబులో వుంది." అంటూ ముందుకు వంగి సమీర తొడుక్కున్న కోటుజేబులోంచి తన పర్స్ తీసుకున్నాడు. టీ తాగాక "మళ్ళీ మరోసారి "సారీ! అవతలవైపు జేబులో నా సిగరెట్లు వున్నాయి." అంటూ ఆ జేబులోంచి సిగరెట్లు తీసుకున్నాడు. ముగ్గురమూ కారువైపుకు నడుస్తున్నప్పుడు సమీర కృత్రిమకోపంతో "ఇంకా తీసుకోవలసిన వేమైనా వున్నాయా?" అంది.

"లేవు-ఇవన్నీ పెట్టెయ్యాలి అంతే!" అంటూ సిగరెట్ పాకెట్ ఒక జేబులోనూ, పర్స్ మరో జేబులోనూ పెట్టేసాడు.

"మళ్ళీ తీసుకోవాలా?"

"అవసరమైనప్పుడు-"

నేను కూడా నవ్వు ఆపుకోలేకపోయాను. నవ్వేసాను. సాగర్ మెరుస్తున్న కళ్ళతో చూసాడు, "అర్థం చేసుకున్నావా?" అన్నాడు.

ఆ తరువాత Table Rock observation Plazaకి వెళ్ళాం- టన్నెల్స్ ద్వారా. జలపాత పట్టానికి దిగువగా ఏర్పాటు చేసారు. జలపాతాన్ని చాలా దగ్గరగా చూట్టానికి వీలుగా. రెయిన్ కోట్స్ వేసుకుని వెళ్ళాం. టన్నెల్స్ లోంచి వెళ్తుంటే, నీటి తుంపరలు మీద పడతాయి. అవి నయగరా జలపాతపు నీటిబిందులవు లనుకొంటే, ఏదో అద్భుత భావన-టన్నెల్స్ లోంచి బయటపడగానే అతి దగ్గరగా ప్రత్యక్షమవుతుంది జలదేవత ఉధృత విశ్వరూపం! ఆ అపూర్వ జలపాతపు బాహిర స్వరూపాన్నే కాక, దాని హృదయాన్ని సహితం దర్శిస్తోన్న అనుభూతి-

'సమీ! ఎంతటి ప్రగాఢమైన ఆకర్షణ? ఏమి విచిత్ర సౌందర్యం! హద్దూపద్దూలేని ఆకాశంలో ఎలా ఎలుగెత్తి పిలుస్తున్నాయి, ఈ అందాలు? వీటిలో పడి చస్తేనేం?'

ఒక విధమైన ఉద్వేగంతో ముందు కడుగు వేసాను - భయంతో నా చెయ్యి పట్టుకుంది సమీర. "జాగ్రత్త అక్కయ్యా! అక్కడ చైన్స్ ఉన్నాయనుకో! అయినా అంత దగ్గరగా వెళ్ళకు."

"ఏం వెళ్తే? ఇంతటి అందాన్నీ,

అనందాన్ని దగ్గిరగా అనుభవించాక ఛస్తేనేం?"

సమీర భయంగా చూసింది. నా చెయ్యి పట్టుకొని బలంగా ఊడ్చుకొచ్చినట్లు అక్కడ్నుంచి లాక్కొచ్చేసి, ఆయాసపడిపోతూ "హమ్మయ్య! ప్రమాదం దాటిపోయింది. నీ ధోరణి చూస్తే నిజంగా ఆ జలపాతంలోకి దూకేస్తావేమోనని అనిపించింది. అలా దూకిన వాళ్ళు వున్నారట!" అంది.

"ఉండనే వుంటారు, పెద్ద ఆకర్షణలో పడి మునిగిపోయేవారు."

సమీరా, సాగర్ ఇద్దరూ నావైపు చూసారు. ఇద్దరికీ నా మాటలు అర్ధమయ్యాయి—సాగర్ ముఖంమీద మబ్బులు సమీర కనుకొనల్లో చిరుజల్లులు!

(Maid of the mist) "మెయిడ్ ఆఫ్ దిమిస్ట్"లో వెళ్దామా?, అన్నాడు సాగర్. అది బోట్ పేరు. నదిమీదుగా జలపాతానికి మరికొంత సన్నిహితంగా తీసికెళ్తుంది అది.

"వద్దు! వద్దు!" అంది సమీర భయంగా.

"ఏం ఫరవాలేదు. నేను జలపాతంలో పడిపోను. నిన్ను పడనీయను. వెళ్దాం!" అన్నాను.

జలపాతానికి సన్నిహితంగా వెళ్తున్న కొద్దీ బోట్ అటూ ఇటూ ఊగసాగింది. భయం—ఉల్లాసం—ఒకదానితో ఒకటి పెనవేసుకొన్న ఆకర్షణ—శరీరాన్ని పులకింపచేసే చిరు నీటిజల్లులు—మొత్తం బోట్‌నే కప్పివేసేలా ఉన్న నీటి తుంపరల మబ్బులు!

ఆ తరువాత (Marine land) మేరైన్ లేండ్‌కి వెళ్ళాం. అక్కడ మిగిలిన డాల్ఫిన్ షోలతోపాటు అత్యంత ప్రమాదకరమయిన తిమింగిలాల చేత నిర్వాహకులు చేయించిన ఫీట్స్ కూడా చూసి, కారులో తిరుగుముఖం పట్టాం!

చీకట్లో దారులు తీరిన కార్ల విద్యుద్దీపాల వెలుగులు! కొన్ని వెనక్కి—మరి కొన్ని ముందుకి! సాగర్ డ్రైవ్ చేస్తున్నాడు. అలసిపోయినదానిలా సమీర అతని భుజంమీద తలవాల్చి నిద్రపోతోంది. అదృశ్యం చూడటానికి ఎంతో బాగుంది. సమీరను ఇక్కడినుంచి తీసుకుపోదామనుకొంటే దానికంటే ముందు నాకే బాధగా వుంది. కానీ తప్పదు.

ఆ మరునాడే సంభాషణ ప్రారంభించాను. నేనిక్కడ ఎక్కువ రోజులు వుండటానికి వీల్లేదు.

"సమీరా! నేనెందుకు వచ్చానో తెలుసా?"

"ఊహించాను!"

"నీ సమాధానమూ నేను ఊహించగలను—కానీ ఒక్క విషయం ఆలోచించు. నయగరా ఎంత అందంగా వున్నా దానిని మనం ఏ విధంగానూ యధాతథంగా ఉపయోగించుకోలేం! దానికి మనం లొంగిపోతే, అది మనను

మింగేస్తుంది. దానిపైన మనం ఆధిపత్యం సంపాదిస్తే, ఆ వుధృతాలను మన ఇంటి వెలుగులుగా మార్చుకోవచ్చు. ఆ తిమింగిలాలు చూడు? మనం కళ్ళు మూసుకు సముద్రంలో దిగితే క్షణంలో మనని నమిలేస్తాయి. నేర్పుగా బంధించి లొంగదీసుకొంటే, చెప్పినట్లు ఆడుతున్నాయి. ప్రకృతికీ మానవుడికీ ఎప్పుడూ సంఘర్షణే! ప్రకృతికి లొంగిపోయినవాడు నాశనమవుతున్నాడు. దీనిని లొంగదీసుకున్నవాడు మానవజాతి చరిత్రను మరో అడుగు ముందుకు నడిపిస్తున్నాడు."

"నిజం నిజం! నిజం నాకు తెలుసు, నా దారి మారనివ్వకూడదు! కానీ సాగర్‌ని వదిలి వుండలేను."

"కానీ ఒకటి చెప్పనా... ఇవాళ కాకపోతే రేపు... కాకపోతే ఎల్లుండి... లేదా మరి కొద్ది కాలం... అంతే? అప్పుడు... అప్పుడు ఏం చేస్తావు సమీరా? పిచ్చి పిచ్చిదానివయిపోతావ్. లేకపోతే ఆ నయగరాలో దూకి ప్రాణాలు అర్పిస్తావా? సమీరా! అప్పుడు నీకు తోడుగా ఎవరూ ఉండరు. ఎవరి దగ్గిరనుండీ ఒక్క సానుభూతి వాక్యం కూడా నీకు దొరకదు... నీ సాగర్ మాత్రం తన మనసులతో ఆడుకొంటూ వుంటాడు హాయిగా."

"అక్కయ్యా!"

"నీకు తెలుసు ఆ నిజం. సాగర్‌ని నేను అర్థంచేసుకున్నాను. అతడు ఏ రకంగానూ నిన్ను మభ్యపెట్టలేదు... వద్దు సమీ! నయగరా అందాలు దూరంనుంచి చూసి ఆనందించాలి... ఆ ఆనందపు అనుభూతులు మనసులలో నింపుకోవాలి. అంతేకానీ, దానిలో దూకి చావాలనుకోకూడదు.

"ఆ విషయం నువ్వే చెప్పావు నాకు, నిన్న."

సమీర తన పెద్దకళ్ళతో బేలగా చూసింది... ఆ కళ్ళనిండా నీళ్ళు-అవి నన్ను చెయ్యిపట్టుకుని బరబర బయటకు లాక్కురావటం గుర్తుకొచ్చింది. ఇప్పుడు నేను అదేపని చెయ్యాలి. సమీరతో ఆలోచిస్తూ ఏ క్షణాల్ని నేను చెయ్యిజారనీయకూడదు.

చకచకా నాకు తోచినట్లు సామాను సర్దేసాను. ఇండియాకి టికెట్ బుక్ చేయించి రిజర్వేషన్ ఫోన్‌లో కనఫర్మ్ చేయించాను. దాని చెయ్యి వదలకుండా టాక్సీలో కూలేసి ఎయిర్‌పోర్ట్‌కి తీసుకొచ్చేసాను. అప్పటికే అక్కడ సాగర్ వున్నాడు. నాకు చాలా ఆనందం కలిగింది. నా ఆలోచన సాగర్‌కి చెప్పినా, అతడు ఏ ఆటంకమూ కలిగించలేదు. నిర్లక్ష్యంతో ఊరుకోనూలేదు. ఇతడిలో ఏదో ఆర్ద్రత వుంది. స్నేహశీలత వుంది. "థాంక్స్ సాగర్!" అని నేనే అతడికి చెయ్యి అందించాను. స్నేహపూర్వకంగా నా చేయి అందుకని వదిలేసాడు విలవలేనట్లు

నా భుజంమీద వాలిపోయిన సమీరను చెయ్యిపట్టుకుని తన మీదకు లాక్కుని గట్టిగా ముద్దుపెట్టుకుని, వెంటనే అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

కళ్ళు రెండూ కన్నీటి తెరలతో మసకబారిపోయి గడ్డిదానిలా వున్న సమీరను చెయ్యిపట్టుకుని విమానంలోకి నడిపించుకొని వెళ్ళాను. *